క్లుప్తంగా

కస్తూర్బా పాఠశాలకు స్పీకర్ బహూకరణ



పాఠశాలకు సౌండ్ పరికరాలు అందించిన దృశ్యం

ఏలూరు రూరల్ : కస్తూర్బా బాలికల పాఠశాలకు రిటైర్డ్ హెచ్ఎం జల్లా వీరభద్రరావు అవుజా కంపెనీ సౌండ్ స్పీకర్, మైక్‌లను శుక్రవారం బహూకరించారని ప్రధానోపాధ్యాయురాలు జి సునీత చెప్పారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నందున విద్యార్థులను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం అందిస్తున్నానని వీరభద్రరావు అన్నారు. సుమారు రూ. 20 వేలు విలువ కల్గిన పరికరాలు అందజేతపై పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కె.మురళీకృష్ణతో పాటు పలువురు ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. గతంలోనూ క్రీడాకారిణులకు బూట్లు, దుస్తులు, నగదు బహుమతి అందజేసారని గుర్తు చేశారు.

వైభవంగా శ్రావణ శుక్రవారం పూజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రావణ మాసం మూడవ శుక్రవారం సందర్భంగా నగరంలోని పలు అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. స్థానిక సత్రంపాడులోని స్వయంభూ సౌభాగ్యలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని విజయలక్ష్మిగా అలంకరించారు. స్థానిక 12 పంపుల సెంటర్‌లోని దుర్గమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు.

యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలి

ఏలూరు (టూటౌన్): అనకాపల్లి ప్రాంతంలో అచ్యుతాపురం సెజ్ పరిధిలో 2019లో స్థాపించిన ఎసైన్షియ అడ్వాన్స్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ఫార్మా కంపెనీలో ఈ నెల 21 సంభవించిన పేలుడులో 18 మంది మరణించారని ఈ దారుణానికి బాధ్యులైన కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవలని రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్‌కే భాషా శుక్రవారం కోరారు. ఈ ఘటనకు బాధ్యులైన పరిశ్రమ యాజమాన్యాన్ని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, రాష్ట్రంలోని అన్ని పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టాయిలెట్ల భారం ఇప్పుడే అధికం : ఏపీటీఎఫ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పాఠశాలలో టాయిలెట్ ఫొటోలు తీసే పనిలో గతంలో కంటే ఇప్పుడే భారం అధికంగా ఉంటోందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీ. రత్నం బాబు, జి. మోహన్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిరోజు సాయంత్రం మూడు గంటల నుంచి 3.30 గంటల మధ్యలో ప్రధానోపాధ్యాయులు టాయిలెట్లను పరిశీలించి రిపోర్ట్ సబ్మిట్ చేయాలని ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రధానోపాధ్యాయులు పరిస్థితి ఆందోళనకరంగా మారిందన్నారు. ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ లేదా ఎస్ఎంసీ కమిటీ టాయిలెట్ల ఫొటోలు తీయకపోయినా ఆ ఒత్తిడి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై పడుతోందన్నారు. టాయిలెట్‌కు సంబంధించి పూర్తి బాధ్యత నుంచి ప్రధానోపాధ్యాయులను మినహాయించి వారిని విద్యా బోధనకే పరిమితం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నీటి వనరులను భావితరాలకు అందించడమే లక్ష్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నీటి వనరులను భావితరాల అవసరాలకు సమృద్ధిగా అందించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శుక్రవారం స్థానిక 50వ డివిజన్‌లో అమృత్ పథకంలో భాగంగా ఏలూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.37.5 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించిన మురుగు నీటి ట్రీట్మెంట్ ప్లాంట్ ట్రయల్ రన్ పనులను చంటి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. మరో 6నెలల కాల వ్యవధిలో ఈ ప్లాంట్ సేవలను ప్రజలకు అందుబాటులోనికి తీసుకువస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నగర పాలక సంస్థ కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, అధికారులు పాల్గొన్నారు.

రెండు వాహనాల సీజ్

దెందులూరు: దెందులూరు మండలం వేగవరం వద్ద ఎస్సై స్వామి పర్యవేక్షణలో పట్టుకున్న 3,500 కేజీల బియ్యాన్ని శుక్రవారం ఏలూరు స్టాక్ పాయింట్‌కు తరలించారు. రెండు వాహనాలను సీజ్ చేశారు. నలుగురిపై పోలీస్, సివిల్ సప్లయ్ విభాగాల్లో నాలుగు సెక్షన్లు పెట్టి కేసు నమోదు చేశామని ఎస్సై కె.స్వామి, తహసీల్దార్ సుమతి తెలిపారు.

నేడు ప్రాజెక్టు సమావేశం

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో శనివారం ప్రాజెక్టు మీటింగ్ నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నత్తానియేలు తెలిపారు. ముఖ్య అతిథిగా మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు) విచ్చేస్తారని తెలిపారు. ప్రాజెక్టు మీట్‌లో అన్ని రకాల స్పోర్ట్స్ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామన్నారు.



మహిళల రక్షణకు పటిష్ట చట్టం చేయాలి



మహిళలపై జరుగుతున్న హత్యాచారాలు, లైంగిక వేధింపులు, దాడుల నియంత్రణకు పార్లమెంటులో పటిష్ట చట్టం చేయాలి. ఇటీవల మహిళలు, బాలికలు, చిన్నారులపై అత్యాచారాలు పెరిగాయి. నివాస ప్రాంతాల్లో మద్యం షాపులు ఉండటం, గంజాయి, డ్రగ్స్, యథేచ్ఛగా సరఫరా కావడంతో మానవ మానవ మృగాలు ఈ దాడులకు తెగబడుతున్నారు. ముఖ్యంగా దాడులు నియంత్రించడానికి, అందరినీ చైతన్యవంతం చేసి, కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన సదస్సులు నిర్వహించాలి. కేంద్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకొని కోల్‌కతాలో జరిగిన దుర్ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి.

– మన్నవ యామిని, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి

అశ్లీల వీడియోలను నియంత్రించాలి



ఆన్‌లైన్‌లో, యూట్యూబ్‌లోని అశ్లీల వీడియోలను చూసి యువత చెడుదారిలో వెళుతున్నారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు, దాడులకు వారు పాల్పడడానికి ఈ అశ్లీల వీడియోలు చూడటమే ముఖ్య కారణం. మహిళలపై దాడులను నియంత్రించేందుకు కచ్చితంగా ఆన్‌లైన్, యూట్యూబ్‌లోని అశ్లీల వీడియోలను నిషేధించాలి. మహిళలపై దాడులు జరిగినప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని కొత్త చట్టాలను తీసుకువస్తున్నాయి. కానీ వాటిని అమలు పరచడంలో విఫలం అవుతున్నాయి. ఒక వ్యక్తి తప్పు చేసి దోషిగా నిర్ధారణ అయిన తర్వాత ఖచ్చితంగా ఆ దోషికి కఠినమైన శిక్షలు అమలు చేస్తేనే ఇలాంటి దాడులు తగ్గుతాయి.

– వరకా శ్యామల, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు

నడకకు దారేదీ?

- నగరంలో వాకింగ్ ట్రాక్ లేక వాకర్ల అవస్థ
- రన్నింగ్ ట్రాక్ ధ్వంసమవుతోందంటూ క్రీడాకారుల ఆవేదన
- క్రీడాధికారులు, వాకర్ల మధ్య వివాదం

ఏలూరు రూరల్ : ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయాలని వాకర్స్ డిమాండ్ చేస్తున్నారు. గోతులమయమైన ట్రాక్‌లో నడవడం వల్ల మడమ నొప్పులతో పాటు పాదాలకు గాయాలవుతున్నాయని వాకర్స్ వాపోతున్నారు. ఈ సమస్యపై క్రీడాధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదు వారు ఆరోపిస్తున్నారు.

ట్రాక్‌పై వివాదం

స్టేడియంలో 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ ఉంది. దీనిపైనే ఇటు వాకర్స్, అటు అథ్లెట్లు ప్రతిరోజూ సాధన చేస్తున్నారు. ప్రతి ఆదివారం వందల సంఖ్యలో యువకులు స్టేడియానికి చేరుకుని క్రికెట్ ఆడుతూ సాయంత్రం వరకూ సేద తీరుతున్నారు. వర్షాకాలం కావడంతో ట్రాక్ చిత్తడిగా మారింది. అనేక చోట్ల గోతులు పడ్డాయి. మరికొన్ని చోట్ల నీరు నిలిచి బురదమయమమైంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వాకర్స్ ట్రాక్‌పై నడుస్తూ అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పలుసార్లు జిల్లా క్రీడాధికారులతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందన లేదని వారన్నారు.

వాస్తవానికి క్రీడల అభివృద్ధి, క్రీడాకారుల శిక్షణ కోసం స్టేడియం నిర్మిస్తారు. ఇందులో పలు రకాల మొత్తటి మట్టితో రన్నింగ్ ట్రాక్ అభివృద్ధి చేస్తారు. అథ్లెట్లు సాధన, పోటీల నిర్వహణ కోసమే దీన్ని ఉపయోగించాలని నిబంధన ఉంది. దీంతో అధికారులు వాకర్స్ కోసం ప్రత్యేక ట్రాక్ అభివృద్ధికి నిధులు వెచ్చించలేకపోతున్నారు. మరోపక్క ట్రాక్ అభివృద్ధి చేయడం లేదంటూ వాకర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గోతులమయమైన రన్నింగ్ ట్రాక్‌పై నడుస్తున్న వాకర్స్

అథ్లెట్ల అసంతృప్తి

స్టేడియంలో రన్నింగ్ ట్రాక్ నిర్వహణపై అథ్లెట్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్ హార్డ్‌గా మారిపోవడం వల్ల సాధన చేయలేకపోతున్నామని వాపోతున్నారు. దీనివల్ల గాయాలు కావడంతో పాటు పరుగు పందెం పోటీల్లో వెనకబడి పోతున్నామని, విజయం సాధించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేషన్ బాధ్యత

నగరంలోని వాకర్లకు అనువైన వాకింగ్ ట్రాక్స్ అభివృద్ధి చేయాల్సిన బాధ్యత నగరపాలక సంస్థపై ఉంది. ఖాళీ స్థలాలు, రోడ్లు, చెరువులు, కాలువ పక్క విశాలమైన స్థలాలను వాకింగ్ ట్రాక్స్‌గా అభివృద్ధి చేసి వాకర్స్‌కు కేటాయించాలి. ఏలూరులో ఇలాంటి ట్రాక్ ఒక్కటీ లేదు. కృష్ణ కెనాల్ పక్కన విశాలమైన కాలువగట్టు నిరుపయోగంగా ఉంది. దీన్ని అభివృద్ధి చేస్తే వాకర్స్ ప్రతిరోజూ సాధన చేసుకుంటారని పలువురు అంటున్నారు.



ట్రాక్‌పై లైనింగ్ వేస్తున్న అథ్లెట్లు

ట్రాక్ గోతులమయం



స్టేడియంలో ట్రాక్ గోతులమయమయ్యింది. అడుగు తీసి అడుగు వేయాలంటే వాకర్స్ భయపడుతున్నారు. పలువురు వాకర్స్ నడుస్తూ మడమ నొప్పితో బాధపడుతున్నారు. వాకర్స్‌కు ప్రత్యేక ట్రాక్ ఉంటే బాగుంటుంది. ట్రాక్ బాగు చేయాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదు. సిబ్బంది లేకపోవడంతో అథ్లెట్లు ముందుకు వచ్చి ట్రాక్ బాగు చేసుకుంటున్నారు.

– ఎంఎస్ అక్బర్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

అథ్లెట్ల కోసమే రన్నింగ్ ట్రాక్



స్టేడియంలో రన్నింగ్ ట్రాక్ అథెట్ల సాధన కోసమే రూపొందించారు. వాకర్స్ రన్నింగ్ ట్రాక్‌పై నడుస్తున్నారు. దీనివల్ల ట్రాక్ హార్డ్‌గా మారి, పోటీలను నిర్వహించలేని విధంగా తయారైంది. వాకర్స్ కోసం గ్యాలరీ పక్క నుంచి ప్రత్యేక వాకింగ్ ట్రాక్ ఉంది. వాకర్స్ అసోసియేషన్ ఈ ట్రాక్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించాం. డీఎస్ఏ వద్ద పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు. ప్రభుత్వం అందించిన నిధులు క్రీడల అభివృద్ధికి వెచ్చిస్తున్నాం.

– బి.శ్రీనివాసరావు, డీఎస్‌డీఓ

పేదలకు భూములు స్వాధీనం చేయండి

ఏలూరు (టూటౌన్) : ఎస్సీ, బీసీలకు చెందిన భూదాన యజ్ఞ భూములను తక్షణం స్వాధీనం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. నిరుపేదలకు చెందిన భూదాన యజ్ఞం భూములను స్వాధీనం చేయాలని కోరుతూ తాడువాయి గ్రామస్తులతో కలిసి జిల్లా రెవెన్యూ అధికారికి శుక్రవారం వినతిపత్రం అందజేసారు. అనంతరం కృష్ణ చైతన్య మాట్లాడుతూ 1983లో ప్రభుత్వం తాడువాయిలో సర్వే నంబరు 99 నుంచి 140 వరకు గల సర్వే నంబర్లలో 100 మందికి ఒక్కొక్క కుటుంబానికి ఎకరం చొప్పున భూదాన యజ్ఞం కింద కోర్టు పట్టాలు మంజూరు చేసిందన్నారు. ఆ భూముల్లో ఎస్సీ, బీసీలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. కొంత కాలంగా ఆ భూములను కౌలుకు సాగు చేస్తున్న వారు ఉద్దేశ్యపూర్వకంగా రెవెన్యూ అధికారులతో కుమ్మకై భూదాన యజ్ఞం భూములను కౌలుదారు పేరున నమోదు చేశారని ఆరోపించారు. దీనిపై పేదలు హైకోర్టును ఆశ్రయించడంతో భూములను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని మండల తహసీల్దార్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వ యంత్రాంగం తక్షణం జోక్యం చేసుకొని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఆర్వోను కలిసిన వారిలో సీపీఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జేవి రమణ, తాడువాయి గ్రామ శాఖ కార్యదర్శి ఓకే చందా త్రిమూర్తులు తదితరులు ఉన్నారు.

ఘనంగా టంగుటూరి జయంత్యుత్సవం



ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి తదితరులు



ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని గౌతమి సమావేశ మందిరంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు జయంత్యుత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా పని చేసిన టంగుటూరి ప్రకాశం పంతులు పేద కుటుంబంలో పుట్టి, వారాలు చేసుకుంటూ చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్నారని తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలిపారు. ప్రకాశం పంతులు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకి గుళ్లకు ఎదురుగా గుండెను ఎదురొడ్డి ఆంధ్రకేసరి అని పేరు పొందారన్నారని కొనియాడారు. పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగా 1953 అక్టోబర్ 1 న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంగా ఏర్పడినప్పుడు దానికి తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు నియమితులై ఆదర్శవంతమైన పాలన అందించారన్నారు. నిస్వార్థంతో దేశ స్వాతంత్ర్యానికి, రాష్ట్ర అభివృద్ధికి పాటుపడిన టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి, బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆర్.నాగరాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ నాగేశ్వరరావు, సెరికల్చర్ డీడీ డి.వాణి, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టంగుటూరి జయంతి

ఏలూరు(మెట్రో): స్వాతంత్ర్యోద్యమంలో టంగుటూరి పాత్ర ఎనలేనిదని ఇరిగేషన్ ఎస్ఈ దేవప్రకాష్, ఎన్‌జీవోస్ నాయకులు చోడగిరి శ్రీనివాస్ అన్నారు. ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు సేవలను ఆదర్శంగా తీసుకొని రాష్ట్రాభివృద్ధికి పాటుపడదామని పిలుపునిచ్చారు. ఎన్‌జీవోస్ నాయకులు, ఇరిగేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి టంగుటూరికి ఘన నివాళి

ఏలూరు టౌన్: స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ప్రతీ ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, మహనీయుల ఆశయాల సాధనకు కృషి చేయాలని ఏలూరు జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఆదేశాల మేరకు టంగుటూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీహరి, డీసీఆర్‌బీ సీఐ ఎం.సుబ్బారావు, ఆర్ఐ పవన్ కుమార్, జిల్లా పోలీస్ ఆఫీస్ రిసెప్షన్ ఎస్ఐ మణి, ఆర్ఎస్ఐలు భాస్కరరావు, వెంకటేష్, సతీష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్

ఆంధ్రకేసరి జయంతి

ఏలూరు(మెట్రో): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని స్థానిక జెడ్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆధ్వర్యంలో జెడ్పీ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆంధ్రకేసరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రకాష్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రకేసరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తదితరులు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శుక్రవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. తొలుత ఉప గ్రంథపాలకుడు ఏ. నారాయణ రావు టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

అంతరిక్ష రంగంలో దూసుకుపోతున్న భారత్

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : అంతరిక్ష రంగంలో భారతదేశం దూసుకుపోతోందని జిల్లా సైన్స్ అధికారి ఎస్‌వీఎస్ సోమయాజులు అన్నారు. శుక్రవారం స్థానిక 12 పంపుల సెంటర్ గాంధీనగర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నేషనల్ స్పేస్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరిక్ష రంగంలో ఇటీవలి కాలంలో భారతదేశం ఎన్నో విజయాలు సాధించిందని అన్నారు. విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలపై దృష్టి కేంద్రీకరించి దేశం గర్వించే శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. అంతరిక్ష నమూనా తయారీపై నిర్వహించిన పోటీలో మూహెచ్ దుర్గా ప్రసాద్, క్విజ్ పోటీలో పీ. తేజేశ్వరి, పెయింటింగ్ పోటీల్లో ఐ. దుర్గా సాహిత్ విజేతలుగా నిలిచారు. విజేతలకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న జిల్లా సైన్స్ అధికారి సోమయాజులు

అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించాం

చంద్రయాన్–3 విజయంతో భారత్ అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించిందని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఏ. నిర్మల జ్యోత్స్న అన్నారు. స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇస్రో అద్భుతమైన పనితీరును, పరిశోధనలో భారతదేశ మార్గదర్శక పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమ నిర్వాహకులు ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ పీఎం సెలీన్ రోస్ మాట్లాడుతూ జాతీయ అంతరిక్ష దినోత్సవం అంతరిక్ష పరిశోధన ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడానికి, అంతరిక్ష విద్యను ప్రోత్సహించడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై, చంద్రయాన్ ప్రయోగంపై క్విజ్, పోస్టర్ పెయింటింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమ నిర్వాహకులను కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ మరియా క్రిస్టియ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సిస్టర్ సుశీల, ఇతర అధ్యాపకులు అభినందించారు.

వైద్యురాలి హత్యను నిరసిస్తూ కొవ్వొత్తులతో ధర్నా

ఏలూరు (టూటౌన్) : కల్‌కతాలోని మెడికల్ కాలేజీలో పీజీ మహిళా వైద్యురాలిపై అత్యంత పాశవికంగా అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనను నిరసిస్తూ ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్‌లో కొవ్వొత్తులతో ధర్నా నిర్వహించారు. ఈ ఘటనకు బాధ్యులైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దుగ్గిరాల శ్రీనివాస్ మోహన్, కార్యదర్శి కాలే శ్రీనివాసరావు, మహిళా నాయకురాలు గాయత్రి, మహిళా బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.



ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ధర్నా

గ్రామ సభల్లోనూ 'పచ్చ'పాతం

- టీడీపీ నేతల ఆధ్వర్యంలో గ్రామసభలు
- వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లకు, ప్రజాప్రతినిధులకు అందని ఆహ్వానం
- అధికారులు, కార్యదర్శులు సైతం వత్తాసు
- తూతూ మంత్రంగా సభలు



కోమటిలంకలో పచ్చనేత అధ్యక్షతన జరిగిన గ్రామసభ, హాజరైన కార్యదర్శి, పోలీసులు



కోమటిలంకలో గ్రామ సభకు వచ్చి నిలబడిన ప్రజలు

ఏలూరు రూరల్: దెందులూరు నియోజకవర్గం, ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో శుక్రవారం అధికారులు నిర్వహించిన గ్రామసభలు పంచాయతీ వ్యవస్థను అపహాస్యం చేశాయి. వైఎస్సార్ సీపీ బలపరచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులు లేకుండా పచ్చ నేతలు ఇష్టారాజ్యంగా తమకు నచ్చిన ప్రదేశాల్లో గ్రామసభలు నిర్వహించారు. గ్రామ కార్యదర్శులతో పాటు పోలీసులు సైతం పచ్చనేతలకు వత్తాసు పలికారు. ఆఖరికి మండల అధ్యక్షుడు పెన్మెత్స శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ మండల సరస్వతి సైతం గ్రామ సభలో పాల్గొనలేని పరిస్థితులను పచ్చనేతలు సృష్టించారు. సభకు వచ్చిన ప్రజలకు కనీసం కుర్చీలు, టెంట్లు, తాగునీరు సైతం ఏర్పాటు చేయలేదు. అంతా టీడీపీ నాయకుల కనుసన్నల్లో తూతూ మంత్రంగా సభలు నిర్వహించి మమ అనిపించారు.



కోమటిలంక పంచాయతీ కార్యాలయంలో ఒక్కడే కూర్చున్న సర్పంచ్ యోహాన్

- కోమటిలంకలో నిర్వహించిన సభకు టీడీపీ నాయకుడు ముంగర నాగరాజు అధ్యక్షత వహించడం అందరినీ నివ్వెరపోయేలా చేసింది. సర్పంచ్ తెనాలి యోహాన్ పంచాయతీ కార్యాలయంలో సభ ఏర్పాటు చేయగా, పచ్చనేతలు బీసీ కాలనీలో గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌తో పాటు సచివాలయ ఉద్యోగులు, రూరల్ పోలీసులు సైతం టీడీపీ నాయకుడు నిర్వహించిన సభలోనే పాల్గొన్నారు. ఆఖరికి అభివృద్ధి పనులపై ప్రజల అభిప్రాయాలు, పనులు గుర్తించకుండానే సభలో పాల్గొన్న వారితో కార్యదర్శి ప్రసాద్ సంతకాలు సేకరించి వెళ్లిపోయాడు. దీనిపై సర్పంచ్ యోహాన్ మాట్లాడుతూ కొందరు వ్యక్తులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ గ్రామాభివృద్ధి కుంటుపడేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సైతం దీనికి వత్తాసు పలకడం బాధ కలిగించిందన్నారు.
- చాటపర్రులో ఎంపీడీఓ బి.ప్రణవి అధ్యక్షతన సభ జరిగింది. సర్పంచ్ గుడిపూడి రఘు సభకు వచ్చిన వేదికపై కూర్చోకుండా వెళ్లిపోయారు. సుమారు 30 నిమిషాల పాటు జరిగిన సభలో టీడీపీ నాయకులు ముంగర నాగరాజు, త్రినాథ్ చౌదరి, రంగారావు పాల్గొని పచ్చనేతలు సూచించిన పలు పనులతో పాటు సుమారు 125 పనులు అధికారులు ఆమోద ముద్ర వేశారు.
- పెదయాగనమిల్లిలో నిర్వహించిన గ్రామ సభకు సర్పంచ్ బలే నాగసులోచనను ఆహ్వానించలేదు. టీడీపీ నాయకులు సభ నిర్వహించారు.
- కోటేశ్వరదుర్గాపురంలో సర్పంచ్ వర్రీ లక్ష్మీదుర్గ అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. గ్రామస్తులు, పెద్దలు, ఉపాధి కూలీల సూచనలు మేరకు మినీగోకులం, రోడ్లు, డ్రెయిన్లు తదితర 47 పనులకు సభ ఆమోదం తెలిపింది.
- ఇదే కోవలో గుడివాకలంక, మొండికోడు, మాదేపల్లి, జాలిపూడి, శ్రీపర్రు తదితర గ్రామాల్లో సభలు తూతూ మంత్రంగా జరిగాయి